## పంట నష్టపోయిన రైతును ఆదుకోవాలని వినతి



డిటికి వినతిపత్రం అందచేస్తున్న రైతు సంఘం నాయకులు

**పుట్లూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

మండలంలోని రామలింగాయపల్లికి చెందిన రైతు రామబ్రహ్మయ్యకు చెందిన ఉల్లిగడ్డలను పొలంలో ఆరబెట్టిన సమయంలో అగ్నికి ఆహుతి కావడంతో తీవ్రంగా నష్టం వాటిల్లిందని దీంతో నష్టపోయిన రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం డిప్యూటి తహశీల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాబావ పరిస్థితుల్లో పలువురు రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోవడంతో పాటు పలువురు రైతులు పంటలు సాగుచేయలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతు బ్రహ్మయ్య అప్పులు చేసి పంట సాగుచేస్తే పంట చేతికొచ్చిన సమయంలో ఇలా పంట అగ్గిపాలు కావడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడన్నారు. కావునా ప్రభుత్వం నష్టపోయిన రైతును ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్య క్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి సత్తార్ గోపాల్, మండల గౌరవాధ్యక్షులు టి.బాలరంగయ్య, నాయకులు విటి రామాంజినేయులు, గోపాలకృష్ణ, మండల ఉపాధ్యక్షులు బుసగాని చిన్నకృష్ణుడు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నకుళ్లాయప్ప, నాయకులు ఓబుళరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తేదేపా నాయకుల ఆర్థికమూలాలు దెబ్బతీసేందుకు కుట్రలు

**- తేదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి**



కాలిపోయిన పంటను పరిశీలిస్తున్న తేదేపా నాయకులు

**పుట్లూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

తేదేపా నాయకుల ఆర్థిక మూలాలు దెబ్బతీసేందుకు కుట్రలు జరుగుతున్నాయని తేదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి సుదర్శన్ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని రామలింగాయపల్లి గ్రామానికి చెందిన తేదేపా నాయకుడు బ్రహ్మయ్యకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి తోటలో ఆరబెట్టిన ఉల్లిగడ్డలకు నిప్పు పెట్టడం చాలా బాధాకరమన్నారు. మండలంలో ఇప్పటికే తేదేపా నాయకులకు చెందిన అరటిగెలలు నరికివేతకు గురయ్యాయన్నారు. ఇలాంటి ఘాతుకానికి పాల్పడుతున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివశంకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఓబులనాయుడు, రవినాయుడు, విజయ్ పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరణ



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న బొంబాయి రమేష్‌నాయుడు

**యాడికి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

మండలంలోని పిన్నేపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలుసుకున్న మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించి బోరు వేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. బోరు వేయించి నీటి సమస్యను పరిష్కరించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ బొంబాయి రమేష్‌నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపిటిసి బొంబాయి బ్రదర్ వెంకటనాయుడు, అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, వార్డు సభ్యులు శ్రీరాములు, గజ్జి బాలపెద్దయ్య, ఎస్‌సి సెల్ కన్వీనర్ పందు శ్రీరాములు, శివ, మనోహర్, చిన్నరాముడు, వీరయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

## భారత్‌రైస్ పథకం అద్భుతం



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**పుట్లూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

భారత ప్రధాని నరేంద్రమోడి ప్రవేశపెట్టిన భారత్‌రైస్ పథకం అద్భుతమని బిజెపి మండల అధ్యక్షులు రాగేని రామాంజియాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాయితీతో మధ్యతరగతి ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించేందుకు ఈ పథకం తీసుకొచ్చారన్నారు. ఈ పథకంలో భాగంగా 5 కిలోలు, 10కిలోల ప్యాకెట్లు అందుబాటులోకి తెచ్చారన్నారు. వ్యవసాయ సహకార సంస్థ, వినియోగదారుల సహకార సంస్థ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## యాడికిలో తేదేపా నాయకుల భారీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న తేదేపా నాయకులు, కార్యకర్తలు

**యాడికి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి తేదేపా కార్యకర్తలతో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. మండల పరిధిలోని గుడిపాడు, నగరూరు, వేములపాడు, రాయలచెరువు, తదితర గ్రామాల మీదుగా యువచైతన్యయాత్ర యాడికి చేరుకుంది. చంద్రబాబునాయుడు ప్రకటించిన ప్రజాకర్షక పథకాల గురించి నాయకులు ప్రజలకు వివరించారు. పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, తాడిపత్రి, తదితర మండలాల నుండి పెద్దఎత్తున తేదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

**పుట్లూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

అనంత జిల్లా కరువు రైతులను ఆదుకోవాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం తలపెట్టిన మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ 2 లక్షల రూపాయల రుణమాఫీ, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట నష్టపరిహారం ప్రకటించాలని కోరుతూ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో మండలంలోని రైతులు, రైతు కూలీలు, రైతు సంఘం నాయకులు పెద్దఎత్తున తరలిరావాలని వారు కోరారు. ఈ కార్య క్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి సత్తార్ గోపాల్, మండల గౌరవాధ్యక్షులు టి.బాలరంగయ్య, ఉపాధ్యక్షులు బుసగాని చిన్నకృష్ణుడు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నకుళ్లాయప్ప, రైతు సంఘం మండల నాయకులు గోపాలకృష్ణ, వీరయ్య, ఓబుళరెడ్డి, సురేష్, రైతులు సంజీవరెడ్డి, పెద్దిరాజు, కృష్ణ రాజు పాల్గొన్నారు.

## సర్పంచు ఔదార్యం

**- స్మశానవాటికలో ముళ్లకంపల తొలగింపు**



ముళ్లకంపలను తొలగిస్తున్న దృశ్యం

**యల్లనూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

మండలంలోని తిరుమలాపురం సర్పంచు రామాంజులరెడ్డి ఔదార్యం చాటుకున్నారు. గ్రామంలో వున్న ఒసి, బిసి, ఎస్‌సి కులాలకు చెందిన స్మశానవాటికల్లో ముళ్లకంపలు ఏపుగా పెరిగి వెళ్లడానికి వీలులేకుండా పోయింది. దీంతో సర్పంచు దగ్గరుండి జెసిబితో ముళ్లకంపలను తొలగింపచేశారు. దీంతో వారు సర్పంచును అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ పంచాతయీ ఎన్నికల్లో ఏవైతే చెప్పానో అవి చేస్తానన్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు.

## 14 నుండి టైలరింగ్‌పై శిక్షణా తరగతులు ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

**అమడగూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో వద్దె ఓబన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 14వతేదీన నుండి మండలంలోని టైలర్లకు శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు టైలర్ల అసోసియేషన్ అధ్యక్షులు జయరాం తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ 18సంవత్సరాల పైబడిన మండలంలోని వివిధ గ్రామాల మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ కార్య క్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం అధ్యక్షులు కిష్టప్ప, ఉప్పుతోళ్ల రమణ, రంగప్ప, తిరుపాల్, కెవి రమణ, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలం రిజిస్ట్రేషన్‌పై అవగాహన



రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**అమడగూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

నవరత్నాలు పేదలందరికి ఇళ్ల కార్య క్రమంలో భాగంగా ఇంటి స్థలం రిజిస్ట్రేషన్‌కు సంబంధించి బుధవారం అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో ఆర్డీఒ ఎం . సన్నీ వంశీకృష్ణ, తహశీల్దార్ వెంకటరెడ్డి, ఆర్ఐ ఈశ్వరయ్య, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 11 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్ఐ

**పుట్లూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

మండలంలోని కుమ్మనమల గ్రామ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కేశవనాయుడు అనే వ్యక్తి వద్ద నుండి బుధవారం 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి కేశవనాయుడును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## నగదు చోరీ

**యల్లనూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని పినిదరి నాగరంగయ్య ఇంటిలో నగదు చోరీకి గురైంది. వివరాలు ఇలా వున్నాయి. నాగరంగయ్య ఉదయాన్నే పొలం దగ్గరికి వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి బీవారులో వున్న 2 లక్షల రూపాయల నగదు చోరీ చేశారు. సంఘటనా స్థలానికి సిఐ సుబ్రమణ్యం చేరుకుని పరిశీలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## జగన్ అసమర్థ పాలనలో యువత భవితకు ముప్పు



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

**ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

రాష్ట్రంలో జగన్‌రెడ్డి అసమర్థ పాలన వల్ల యువత భవితకు ముప్పు వాటిల్లిందని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల కన్వీనర్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు పిట్టా ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టారు. సైకో పోవాలి.... సైకిల్ రావాలి, రాష్ట్రం బాగుపడాలి... చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ....జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. జగన్‌రెడ్డి నిరుద్యోగులకు ద్రోహం చేశాడన్నారు. 2.30 లక్షల ఉద్యోగాలు ఖాళీల భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలిస్తానని ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కాడన్నారు. ఎన్నికల ముందు డిఎస్సీ ద్వారా 23వేల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని తుంగలోని తొక్కి ఎన్నికల సమయం దగ్గర పడడంతో 6100 డిఎస్సీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి మమ అనిపించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి జెరిపిటి అంజినప్ప, తెలుగు రైతు మీడియా కోఆర్డినేటర్ జాకీర్ అహ్మద్, తెలుగు యువత బోనాల బాలక్రిష్ణ, సర్పంచ్ శంకర్‌రెడ్డి, నాయకులు ఇడగొట్టు ఆంజనేయులు, చౌట కిష్టప్ప, గంగాద్రి, చంద్రా యుడు, ఇర్షాద్, మాజీ సర్పంచ్ నరిసంహులు, షాను, ఐటిడిపి షానవాజ్, రామా నాయుడు, మస్తానమ్మ, ఆకుతోటపల్లి నరసింహులు, సాదీ నాగరాజు, షాను, షబ్బీర్, చాంద్‌బాష, అబ్లూ, రంగారెడ్డి, అంజన్‌రెడ్డి, సాంబశివారెడ్డి, శంకర, శ్రీనివాసులు, ఓబుళరెడ్డి, రామానాయుడు, కంచి సురేష్, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెర్ల సేవకుడు మల్లెల జయరాం



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

**ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

వడ్డెర్ల సంక్షేమానికి అహర్నిషలు పాటు పడే వ్యక్తి మల్లెల జయరాం అని వడ్డెర సంఘం నాయకులు ఆయన సేవలను కొనియాడారు. స్థానిక వడ్డెర సంఘం కార్యాలయంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు ఆర్‌ఎంపి కిష్టప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణల ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ..... వడ్డెర జాతి అభివృద్ధి కోసం గత 30 సంవత్సరాలుగా పుట్టపర్తి నియోజకవర్గంలో మల్లెల జయరాం ఎనలేని సేవలు చేశారన్నారు. వడ్డెర్ల కష్టనష్టాలో తోడుగా ఉంటూ అండగా ఉంటానని భరోసా ఇచ్చి వారిలో నైతిక స్థైర్యాన్ని నింపి ఆర్థికంగా చేయూతనం దించిన వ్యక్తి అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో వడ్డెర్లు అంటే ప్రతి ఒక్కరి మదిలోనూ జయరాం స్మరణకు వచ్చేలా ఆయన సేవాకార్యక్రమాలు కొనసాగించా రన్నారు. అలానే నేటి వరకూ తన సేవలను కొనసాగిస్తూనే ఉన్నారన్నారు. మల్లెల జయరాం లాంటి ఉదార స్వభావం ఉన్న వ్యక్తి చట్టసభలకు వెళితే వడ్డెర్ల జాతి బాగుపడుతుందన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో తాము దాదాపు 45 వేల ఓట్లు కలిగి ఉన్నామన్నారు. మల్లెల అభ్యర్థిత్వాన్ని తెలుగుదేశం పార్టీ అధిష్టానం పరిశీలించి జయరాంకు అసెంబ్లీ టికెట్ కేటాయిస్తే వడ్డెర్లఅంతా ఐకమత్యంగా ఉండి సునాయాసంగా గెలిపించుకుంటామని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రమణ, మహేష్, నాగరాజు, మనోజ్‌కుమార్; ఉత్తప్ప, వేమనారాయణ, రవి, రామచంద్ర, నాగలక్ష్మి, బళ్లారి వెంకటరమణ పాల్గొన్నారు.

## నులుపురుగులు నివారిస్తే మరింత ఆరోగ్యం




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడిఓ

**ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

చిన్నారుల్లో నులిపురుగులు నివారిస్తే మరింత ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ కమల్‌రోహిత్, ఎంపీడిఓ వరలక్ష్మి పేర్కొనా న్నరు. బుధవారం స్థానిక పిహెచ్‌సిలో జాతీయ నులిపురుగుల కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నులిపురుగుల వల్ల చిన్నారులు తరచూ అనారోగ్యానికి గురవుతూ ఉంటారన్నారు. వైద్యుల సలహా మేరకు నులిపురుగుల మందులను చిన్నారులకు ఇవ్వాలన్నారు. రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై వారికి అవగాహన కలిగించారు. పోషకాహారంలో ఐరన్ ప్రాముఖ్యతకు గురించి వివరించారు. మండల వ్యాప్తంగా 9970 మంది విద్యార్థుల లక్ష్యంగా ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాలల్లో రేపటి నుండి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా విభాగాల వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల కమిటీ ఎంపిక

**ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**



బిజెపి నూతన కమిటీని ప్రకటిస్తున్న నాయకులు

ఓడిసి మండల బిజెపి శాఖ నూతన కమిటీని జిల్లా అధ్యక్షులు శేఖర్‌స్వామి ఆధ్వర్యంలో ఏక గ్రీవంగా ఎంపిక చేశారు. బుధ వారం నూతన కమిటీ సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లా బిజెపి అధ్య క్షులు శేఖర్‌స్వామి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎంపిక జరిగిం దని మండల అధ్యక్షులుగా సున్నంపల్లి రంగారెడ్డి, ఉపాధ్య క్షులుగా నాగప్ప, లక్ష్మిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, నీలకంఠారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, బలరామ్, భానుచందర్, కోశాధికారి ఓబుళేసు, కార్యవర్గ సభ్యులుగా నరసింహులు, లక్ష్మినారాయణ, వెంకటరమణ, అంజినప్ప, ఓబుళేసు, కిష్టప్ప, జగదీష్, శివలింగం, ఆంజనేయులుతో పాటు మహిళామోర్చా, మైనార్టీ మోర్చా, కిషాన్ మోర్చాతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఆశ్వర్థప్ప, కిష్టప్ప, రామచంద్ర, వెంకటరమణలు ఎంపికయ్యారన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులకు బిజెపి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియచేశారు.

## ఆర్టిసి బస్సులోనే సురక్షిత ప్రయాణం

**కదిరి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

ఆర్టిసి బస్సుల్లోనే సురక్షిత ప్రయాణమని డిపో మేనేజర్ మైనుద్దీన్ తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం రూరల్ మండల పరిధిలోని స్పేస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు నియమాలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించి సురక్షితమైన ప్రయాణం చేయాలన్నారు. రోడ్డుప్రమాదాల వల్ల ఎదుర్కొనే సమస్యలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాధిక్, అసిస్టెంట్ మేనేజర్లు హరి మోహన్, హరిత, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రత- మనందరి భాధ్యత

**-ఎంవిఐ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలు**

**-రోడ్డు భద్రత నిభందనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు**

**-మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ వరప్రసాద్**



రోడ్డు భద్రత మాసోత్సవాలలో మాట్లాడుతున్న ఎంవిఐ వరప్రసాద్

**తనకల్లు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**

జాతీయ భద్రత మాసోత్సవాలు 2024లో భాగంగా రోడ్డు భద్రతా మాసోత్స వాలను కదిరి మోటార్ వెహికల్ ఇన్స్ పెక్టర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంవిఐ వరప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు భద్రత గురించి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన భాధ్యత కలిగి ఉండాలని, రోడ్డు ప్రమాదంలో జరగకుండా ఉండాలని, అధిక వేగంతో రోడ్డుపై వాహనాలు నడవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతోందని, రోడ్డు వాహనాలు నడిపే ప్రతి ఒక్క వ్యక్తి నిబంధనలు పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. అదేవిధంగా వాహనాలు నడిపేటప్పుడు ఇంటిలో ఉన్న కుటుంబ సభ్యులను గుర్తు తెచ్చుకొని వాహనాలు నడపాలని మరల తిరిగి ఇంటికి వెళ్ళేదాకా జాగ్రత్త వహించాలని, ఇంటిలో ఉన్నవారు మీకోసం ఎదురు చూస్తూ ఉంటారని, అందువలన ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని వారన్నారు, వాహన డ్రైవర్‌లు అందరికీ అవగాహన కల్పించి ప్రతి ఒక్కరికి వాటిపై పూర్తి స్థాయి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రికార్డులు తప్పనిసరిగా కలిగిఉండాలని, వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపరాదని, సీట్‌బెల్ట్, హెల్మెట్ ధరించి వేసుకొని డ్రైవింగ్ చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే కేసు నమోదు చేసి జైలుశిక్ష విధించబడునని వారన్నారు. అంతేకాకుండా ఆటోలు ఓవర్ లోడ్ వేసి స్పీడ్‌గా వెళ్ళరాదని, మినిమం లోడు వేసుకోవాలని వారు సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## బిసిలను మోసం చేసిన వైకాపా సర్కార్



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

**కదిరి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

బిసిలను వైకాపా సర్కార్ మోసం చేసిందని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ పరిశీలకులు వాహి, బిసి జిల్లా అధ్యక్షులు కుంటిమద్ది రంగయ్యలు ఆరోపించారు. బుధశారం టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట ఆదేశాల మేరకు ఎస్‌వి ఫంక్షన్ హాల్‌లో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఒక్క ఛాన్స్‌తో అధికారంలోకి వచ్చిన వైకాపా అన్ని వర్గాల ప్రజలతోపాటు బిసిలను నిట్టనిలువునా ముంచేసిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో బిసిలకు ఉన్న పథకాలను రద్దు చేశారన్నారు. వైకాపా ప్రభుత్వం బిసిలకు ఏ మాత్రం పట్టించుకోలేదని త్వరలో జరిగే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పడానికి సిద్దంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డైమండ్ ఇర్ఫాన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



ఆర్టిఓను సన్మానిస్తున్న దృశ్యం

**కదిరి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని జైన్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ వరప్రసాద్ పాల్గొని విద్యార్థులకు పలు రకాల సలహాలు, సూచనలు అందించారు. అనంతరం ఎంవిఐని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ముఖ్య కార్యనిర్వహకులు సాగర్, ప్రిన్సిపాల్ జై గుప్తా, కోఆర్డినేటర్లు ఉమా మహేశ్వర్, జాఫర్ వలి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌పిని కలసిని సిఐ, ఎస్ఐలు



ఎస్‌పికి పుష్పగుచ్ఛ అందిస్తున్న సిఐ శివప్రసాద్, ఎస్ఐ నరసింహుడు

**పుట్టపర్తి, ఫిబ్రవరి 07, ప్రభాతవార్త**

శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌పి ఎస్.వి.మాధవరెడ్డిని ఆయన ఛాంబర్‌లో ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐ, ఎస్ఐలు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. తిరుపతి ట్రాఫిక్ సిఐగా పని చేస్తున్న శివప్రసాద్ రామగిరి సిఐగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే బుక్కపట్నం ఎస్ఐగా పని చేస్తున్న నరసింహుడు పట్నం ఎస్ఐగా బదిలీ అయ్యారు. దీంతో వీరు జిల్లా ఎస్‌పి ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగాకలుసుకొని పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి వారిని ఉద్దేశించి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతంకలగకుండా గట్టిగా పని చేయాలన్నారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందేలా విధులు నిర్వహించాలని సూచించారు.

## బిసి మహాసభను జయప్రదం చేయండి

**నల్లచెరువు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని మాజీ ఎంపిపి మాబుసాబ్ మిల్లులో టిడిపి నాయకులు, పాత్రికేయులు బుధవారం సమావేశం నిర్వహించడం జరిగింది. మండల కేంద్రంలోని గీతామందిరం నందు శుక్రవారం జరగబోయే జయహో బిసి సభకు కదిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, జిల్లా నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని, కావున మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్, సర్పంచ్‌లు హర్షవర్ధన్‌నాయుడు, నాగరాజు, గుత్తా ప్రసాద్, బిసి నాయకులు దేవేంద్ర గౌడ్, బషీర్ అహ్మద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

